క్లుప్తంగా

విరూపాక్షి మారెమ్మకు ప్రత్యేక పూజలు


విరూపాక్షి మారెమ్మ

పుంగనూరు: పట్టణంలో బస్టాండులోని శ్రీవిరూపాక్షి మారెమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం రాహుకాల పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి నేతిదీపాలు పెట్టి, చల్లముద్ద నైవేద్యంతో మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

4న మండల సమావేశం

రొంపిచెర్ల: రొంపిచెర్ల మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రెడ్డెప్పచ్చారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

సూపర్‌బజార్‌లో రికార్డుల తనిఖీ


రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ

పలమనేరు: పట్టణంలోని బాలాజీ సహకార సూపర్‌బజార్‌లో రికార్డులను స్థానిక ఆర్డీఓ మనోజ్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. సూపర్ బజార్‌లో అక్రమాలు జరుగుతున్నాయని అందిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేసినట్టు ఆయన పేర్కొన్నారు. తమ పరిశీలనలో ఎలాంటి తప్పులు కనపడలేదని, అయితే రికార్డులను అప్‌డేట్‌లో ఉంచుకోవాలని ఆయన అక్కడి సిబ్బందిని సూచించారు.

ఆటో ఢీకొని మోటార్ సైక్లిస్టుకు తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడిన గోపి

చౌడేపల్లె: ఆటో ఢీకొని మోటార్ సైక్లిస్టు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు..మండలంలోని గడ్డంవారిపల్లెకు చెందిన గోపి(38) చౌడేపల్లె నుంచి మోటార్ సైకిల్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా తెల్లనీళ్లపల్లె సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో అతడిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని 108 సిబ్బంది గణేష్, చిట్టిబాబు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోయినవన్నీ పలమనేరుకు మళ్లీ రప్పిస్తా!

- ఇక్కడి పలు కార్యాలయాలు పుంగనూరుకు పోయింది గతంలోనే
- 2026లో కొత్త నియోజకవర్గాలు రానున్నాయ్
- నిర్భయంగా వార్తలు రాస్తే సంతోషిస్తాం
- పలమనేరుకు పదింతలు లాభం కలిగేలా కృషి చేస్తా
- 'సాక్షి' కథనంపై స్పందించిన పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి


పాలన ఇక్కడ.. పనులకు అక్కడ..!

పలమనేరు: పలమనేరు నియోజకవర్గానికి సంబంధించి ఇక్కడి కార్యాలయాలు పుంగనూరుకు పోవడం, రాష్ట్రంలో ఎంతో లాభాల్లో ఉన్న ఇక్కడి ఆర్టీసీ డిపో నిర్వీర్యం చేసిందెవరో ప్రజలకు తెలియందేమీ కాదని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో «పాలన ఇక్కడ.. పనులకు అక్కడ..!» శీర్షికతో ప్రచురించిన కథనంపై ఎమ్మెల్యే స్పందించారు. టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. లాభాల బాటలో ఉన్న పలమనేరు డిపోలోని 20 సర్వీసులు పుంగనూరుకు తీసుకెళ్లి కుప్పం డిపోకు చెందిన 13 సర్వీసులను ఇక్కడికి తీసుకొచ్చి నిర్వీర్యం చేసింది నాటి ప్రభుత్వమేనని ఆరోపించారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో కుప్పం డిపోకు చెందిన 13 బస్సులను వారే తీసుకెళ్లారని, దీంతో నష్టం వాటిల్లింది ఇక్కడి డిపోకేనని పేర్కొన్నారు. ఇక పలమనేరు రెవెన్యూ డివిజన్ అవడంతో గతంలో పుంగనూరులో ఉన్న పలమనేరుకు చెందిన పలు శాఖల కార్యాలయాలను ఇక్కడికి తీసుకొచ్చేందుకు తప్పకుండా కృషి చేస్తామన్నారు. గతంలో పెద్దపంజాణి మండలం పుంగనూరు నియోజకవర్గంలో ఉండేదని, నియోజకవర్గ పునర్విభజన తర్వాత ఆ మండలం పలమనేరులో విలీనమైందన్నారు. భౌగోళికంగా తన సొంత మండల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందనే భావించామన్నారు. 2026లో కొత్త నియోజకవర్గాలు ఆవిర్భవించనున్న నేపథ్యంలో అప్పటికి ఇది ఎలా ఉంటుందో తెలుస్తుందన్నారు. కానీ తాను ఇక్కడి ఎమ్మెల్యేగా స్థానిక డిపోపై గానీ లేదా ప్రజల సౌకర్యార్థం ఇక్కడి కార్యాలయాలు రప్పించడం చేస్తామన్నారు. పలమనేరుకు ఎంత నష్టం జరిగిందో అంతకు పదింతల లాభం కలిగేలా ఇక్కడి శాసనసభ్యుడిగా తన బాధ్యతను నిర్వర్తిస్తానన్నారు. పత్రికలు సైతం నిర్భయంగా ప్రజలకు మేలు చేసే ఇలాంటి కథనాలకు ఇంకా రాయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, కిశోర్‌గౌడ,సోమశేఖర్ గౌడు, ఆర్‌బీసీ కుట్టి, ఖాజా, పవిత్ర హోటల్ అధినేత అమరనాథ రెడ్డి, గిరి, వీ.కోట నాయకులు పాల్గొన్నారు.

డీలర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక


మండల పరిషత్ కార్యాలయంలో సమావేశమైన డీలర్లు

కుప్పం: కుప్పం మండల డీలర్ల అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డీలర్ల అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. నూతన ప్రభుత్వం ఏర్పడ్డ కారణంగా కొత్త కమిటీని ఏర్పాటు చేసినట్లు డీలర్లు చెప్పారు. అధ్యక్షుడిగా వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా మణి, ఉపాధ్యక్షుడిగా ఎత్తిరాజు, కోశాధికారిగా రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రామకుప్పంలో..


బాబు

రామకుప్పం: మండల రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా రామకుప్పానికి చెందిన బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా వెంకటాచలపతి, ప్రధాన కార్యదర్శిగా అమరేష్, సంయుక్త కార్యదర్శి పార్వతమ్మ, కోశాధికారిగా రుక్మాంద రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా హరినాయక్‌ను ఎన్నుకున్నారు.

ఆలయానికి వెండి హస్తం సమర్పణ


స్వామి వారికి వెండి హస్తాన్ని సమర్పిస్తున్న దాత


స్వామివారు

పలమనేరు: స్థానిక బజారు వీధిలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయానికి స్థానికులైన ఆర్వీ బాలాజీ కుటుంబీకులు రూ.30వేల విలువైన వెండి హస్తాన్ని శుక్రవారం సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి ఆ హస్తాన్ని స్వామివారికి అలంకరించారు. ఆలయ నిర్వాహకులు, అర్చకులు దాత, వారి కుటుంబీకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేక కార్యక్రమాల్లో వెండి హస్తాన్ని అలంకరిస్తామన్నారు.

బడిలో డ్రాపౌట్ చేరిక

బైరెడ్డిపల్లి: బడి మానేసిన విద్యార్థిని మళ్లీ బడిబాట పట్టించారు. వివరాలు..మండలంలోని తీర్థం గ్రామానికి చెందిన క్రిష్ణమూర్తి కుమారుడు పి.రాజేష్ తీర్థం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వతరగతి చదువుతూ డ్రాపౌట్ అయ్యాడు. ఏడాదిగా పాఠశాలకు హాజరుకాకపోవడంతో సీఆర్‌పీ షాబుద్దీన్ ఆ గ్రామానికి వెళ్లారు. రాజేష్ తల్లిదండ్రులకు కలిసి విద్య ప్రాముఖ్యతను తెలియజేసి రాజేష్‌ను తిరిగి 9వ తరగతిలో చేర్పించారు. హెచ్‌ఎం రాధమ్మ అభినందించారు.


బడి మానేసిన విద్యార్థిని పాఠశాలలో చేర్పిస్తున్న సీఆర్‌పీ షాబుద్దీన్

ఉచిత హోమియో వైద్య శిబిరం


విద్యార్థులకు హోమియో మందులు మింగిస్తున్న వైద్యులు

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని గడ్డూరు ప్రభుత్వ పాఠశాలలో స్థానిక హోమియో వైద్యులు శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పిల్లలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు మోహనక్రిష్ణ, గౌరీశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎనిమిది మంది వార్డు సభ్యుల రాజీనామా


రాజీనామా లేఖను ఎంపీడీఓకు అందజేస్తున్న వార్డు సభ్యుడు

రొంపిచెర్ల: మండలంలో ఎనిమిది మంది వార్డు సభ్యులు తమ పదవులకు రాజీనామా చేసినట్లు మండల అభివృద్ధి అధికారి రెడ్డెప్పచ్చారి శుక్రవారం తెలిపారు. రొంపిచెర్ల పంచాయతీలో ఎఫ్.మస్తాన్, సి.లక్ష్మయ్య, ఎన్.నిజాముద్దీన్, బోడిపాటివారిపల్లె గ్రామ పంచాయతీలో డి.సురేష్, ఎం.దీప, ఎస్.రెడ్డెమ్మ, జాండ్లవారిపల్లె గ్రామ పంచాయతీలో ఎస్.బావాజి, ప్రభుకుమార్ వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత


పుంగనూరులో విద్యార్థులతో ర్యాలీ చేస్తున్న ఎంఈఓలు

పుంగనూరు: విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా సమగ్రశిక్ష ఏఎల్‌ఎస్‌ఓ అజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం «నేను బడికిపోతా» కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఇస్లాంనగర్, నక్కబండ ప్రాంతాలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, బడిఈడు పిల్లలను పనిలో కాకుండా బడిలో ఉండాలనే ఉద్దేశంతో నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బడిఈడు పిల్లలను పనుల్లో పెట్టుకుంటే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. పుంగనూరులో కొంతమంది తల్లిదండ్రులు తమ బడిఈడు పిల్లలను చింతకాయ బట్టీలు, ఇటుక బట్టీల వద్ద కూలీ పనులకు పంపుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారిని గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టి, ఉపాధ్యాయులు సురేంద్రబాబు, ఆసాద్, ఐసీడీఎస్ సిబ్బంది కల్పన, సీఆర్పీలు శ్రీనివాసులు, నారాయణస్వామి, అబ్దుల్ లతీఫ్, మీనాక్షి, అంజమ్మ, మంజుల, వెంకట్రమణ, తేజ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌రోల్‌మెంట్ చేద్దాం

పలమనేరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాప్రవేశం కార్యక్రమం ద్వారా బడిఈడు పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈఓ లీలారాణి కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మండలంలోని హెచ్‌ఎంలకు సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటికే సచివాలయాల్లో ఉన్న డాటా ఆధారంగా బడికి రాని పిల్లలను గుర్తించి వారిని బడికి రప్పించేలా చేయడంలో ఉపాధ్యాయులు గట్టిగా కృషి చేయాలన్నారు. బడికి పంపడానికి పిల్లల తల్లిదండ్రులు అంగీకరించని పక్షంలో వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమం వచ్చేనెల 27 వరకూ నిర్వహిస్తామని, ఆలోపు టార్గెట్లను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 బాలసుందరం, సీఆర్‌ఎంటీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఐఆర్‌టీ మెసెంజర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఈఓ లీలారాణి

ఈఓఆర్డీ సేవలు శ్లాఘనీయం




ఈఓఆర్డీ, ఎంపీడీఓలను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు, గుడుపల్లెలో..

పలమనేరు: పలమనేరు మండలంలో దీర్ఘకాలంగా పనిచేస్తూ పంచాయతీల్లో సమస్యల పరిష్కారంలో ఎంతో చొరవ చూపిన ఈఓఆర్డీ గిరిధర్ సేవలు శ్లాఘనీయమని పలమనేరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు రంగనాథం, చెంగారెడ్డి, రాజారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఈఓఆర్డీ గిరిధర్, ఎంపీడీఓ విద్యాసాగర్ ఉద్యోగ విరమణ పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని ఒక కళ్యాణ మండపంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వివిధశాఖల అధికారులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు వారిని ఘనంగా సన్మానించారు. వారి సేవలను ప్రస్తుతించారు. ఉద్యోగ విరమణ అధికారులు మాట్లాడుతూ, తమ విధి నిర్వహణకు మండలంలో నాయకులు, సహ ఉద్యోగులు సహకరించారని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఏపీ ఎన్జీవోల సంఘ నాయకులు ఆనంద్, ఏడీ అన్నపూర్ణదేవి, ఏఓ గీత, ఎంఈఓ లీలారాణి, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: ఈఓపీఆర్డీ జేవీ శంకర్ ఉద్యోగ విరమణ పురస్కరించుకుని శుక్రవారం ఘనంగా సన్మానించారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో పంచాయతీ రాజ్ శాఖ, రెవెన్యూ శాఖ, సచివాలయం అధికారులు ఈ కార్యక్రమం నిర్వహించారు. 1985లో వీఎల్‌డబ్ల్యూగా ఉద్యోగంలో చేరి అంచెలంచెలుగా ఆయన ఎదిగారని, 39 ఏళ్ల సర్వీసులో సేవలను నిబద్ధతతో నిర్వర్తించారని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పురుషోత్తం, తహసీల్దార్ అక్బర్ హుస్సేన్, కార్యదర్శులు శివశంకర్, చంద్రప్ప, సురేష్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఈరోజు

బోయకొండలో హుండీ లెక్కింపు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో శనివారం ఉదయం 7 గంటలకు హుండీ ఆదాయం లెక్కించనున్నట్టు ఈఓ చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆలయ, బ్యాంకు, పోలీసు సిబ్బంది విధిగా హాజరు కావాలని కోరారు.

జాతీయ లోక్ అదాలత్

పలమనేరు: పట్టణంలోని సీనియర్ సివిల్ కోర్టులో శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. స్థానిక కోర్టులో ఆయన మాట్లాడారు. రాజీ మార్గమే రాజమార్గం కాబట్టి కక్షిదారులు అనవసరమైన పంతాలకు పోకుండా పెండింగ్ కేసులను రాజీ చేసుకుని శాంతిపూర్వకంగా ఉండేలా జీవించాలని కోరారు.

ఎంఈఓకు ఉద్యోగ విరమణ సన్మానం

శాంతిపురం: 30వ తేదీన ఉద్యోగ విరమణ చేయనున్న ఎంఈఓ-2 కె.గోవిందరాజులును శనివారం మధ్యాహ్నం 3 గంటలకు మండల సచివాలయ సమావేశ మందిరంలో సన్మానించనున్నట్టు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తెలిపారు. ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

ఈకేవైసీ కోసం పరుగులు

- 3 ఉచిత సిలిండర్ల కోసమేనంటూ ప్రచారం!

నగరి: తమ ఏజెన్సీలో వాస్తవ వినియోగదారులు ఎందరున్నారు? వారు లేకున్నా పాసుపుస్తకాలతో సిలిండర్లు ఎవరు కొనుగోలు చేస్తున్నారు? తదితర వివరాలు తెలుసుకోవడానికి గ్యాస్ ఏజెన్సీలు ఈకేవైసీకి పూనుకున్నాయి. ఇందులో భాగంగా ఏజెన్సీ సిబ్బంది వినియోగదారుల ఇళ్ల వద్దకు వెళ్లినప్పుడు గ్యాస్ పుస్తకాలు, బాండ్లు ఆఫీసుకు తేవాలని, వేలిముద్రలు పెట్టాలని చెప్పారు. ప్రభుత్వం మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వడానికే ఈకేవైసీ చేస్తున్నారని ప్రచారం కావడంతో జనం హెచ్‌పీ, ఇండేన్ గ్యాస్ ఏజెన్సీల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఈకేవైసీ చేసుకోకపోతే ప్రభుత్వం చెప్పినట్లు 3 సిలిండర్లు ఉచితంగా ఇవ్వరేమోనన్న భయం పట్టుకుంది. దీంతో ఎవరికి వారు గ్యాస్ పుస్తకాలు, బాండ్లు తీసుకొని ఏజెన్సీ కార్యాలయాల వద్దకు వెళ్తున్నారు. ఇతరుల పేరిట ఉన్న పాసుపుస్తకాలను తమ పేరిట మార్చుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. మరోవైపు అందరూ ఒక్కసారికే వచ్చిపడడంతో సర్వర్ బిజీ కావడం, వేలిముద్రల సెన్సార్ల సమస్య తలెత్తడంతో ఏజెన్సీ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. నగరిలోని హెచ్‌పీ, ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలలో సుమారు 30 వేల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, ప్రస్తుతం పక్కాగా ఉన్నవేవో తెలుసుకోవడానికే ఈకేవైసీ చేస్తున్నట్టు కార్యాలయ నిర్వాహకులు తెలిపారు.


ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం ముందు బారులు తీరిన వినియోగదారులు

మట్టి తరలింపుపై ఫిర్యాదు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం చెర్లోపల్లె పంచాయతీ బాపనచెరువు నుంచి మట్టి తరలిస్తున్నారని శుక్రవారం గ్రామస్తులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. జేసీబీలతో ఇష్టారాజ్యంగా మట్టి తోడేస్తున్నారని తెలిపారు.

సరైన పోషణతోనే పశు సంరక్షణ


పాడి ఆవులు



- మేత విషయంలో జాగ్రత్తలు అవసరం
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కాణిపాకం: వ్యవసాయంతో పాటు పశుపోషణ గ్రామాల్లో ప్రధాన వృత్తిగా ఉంటుంది. పాడి రైతులు తమ పశువులను సొంత బిడ్డల్లా చూసుకుంటూ ఉంటారు. ప్రస్తుతం సీజన్ మారుతోంది. వర్షాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో పశువులు జబ్బుల బారిన పడకుండా ఉండాలంటే రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా వాటికి పోషకాహారం అందజేయాలి. అప్పుడు పశుసంపద వృద్ధి చెందుతుంది. పశువులకు తగిన మోతాదులో మాంసకృత్తులు, పిండి, కొవ్వు పదార్థాలు, విటమిన్లు, నీరు అవసరమని పశుసంవర్ధక శాఖాధికారులు సూచిస్తున్నారు.

రోగనిరోధక శక్తికి..

పశువుల ఎదుగుదలకు, రోగనిరోధకశక్తికి మాంసకృత్తులు ఎంతో అవసరం. పడ్డలు, పెయ్యల ఎదుగుదలకు, పాడి పశువుల్లో పాల దిగుబడికి దోహదపడతాయి. ఇవి ఆహారంలో లోపిస్తే పశువులు చిక్కిపోవడం, ఎదుగుదల స్తంభించడం, అండాశయం చిన్నగా ఉండడం, ఆలస్యంగా ఎదకు రావడం, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం, కండరాల బలహీనత వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. పత్తి గింజలు, కొబ్బరి పిండి, వేరుశనగ పిండి, నువ్వుల పిండి, చేపల పొడి వంటి పప్పు జాతికి చెందిన పశుగ్రాసాల్లో సమృద్ధిగా లభిస్తాయి.

దెబ్బల నుంచి రక్షణ

పశువుల శరీరంలో కొవ్వు నిల్వలు అంతర్గత అవయవాలను దెబ్బల నుంచి కాపాడతాయి. శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తాయి. ఆహారంలో రుచిని పెంపొందిస్తాయి. పశువుల సక్రమ పునరుత్పత్తిలో మాంసకృత్తుల కంటే కొవ్వు అందించే శక్తి ముఖ్యమైంది. కొవ్వు, పిండి పదార్థాల కన్నా రెండున్నర రెట్లు అధిక శక్తినిస్తాయి. ఒక గ్రాము కొవ్వు పదార్థం సుమారు 9 కిలోల క్యాలరీల ఉష్ణశక్తిని అందిస్తుంది. వేరుశనగ పిండి, కొబ్బరి పిండి, నూనె గింజల చెక్క, గోధుమ తవుడు, వరి తవుడులో కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి.

చిత్తూరు డివిజన్‌లో పశుసంపద వివరాలు

రకం		సంఖ్య
ఆవులు	-	4,67,507
గేదెలు	-	1036
గొర్రెలు	-	438362
మేకలు	-	138463

నీరు అత్యంత అవసరం

పశువులు నీరు లేకుండా ఐదు రోజులకు మించి బతకలేవు. నీరు శరీర జీవన ప్రక్రియ ఉత్పాదకతకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆహారంలోని వివిధ పోషక పదార్థాలను సంగ్రహించడానికి, పోషకపదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు శరీరంలోని వివిధ భాగాలకు చేర్చడానికి, శరీర ఉష్ణోగ్రతను క్రమ బద్ధీకరించడానికి, శ్వాస ప్రక్రియ కొనసాగడానికి, శరీర ద్రవాల పీచు సాధారణ స్థాయిలో ఉండేందుకు, చర్మం సాగే గుణం కలిగి ఉండడానికి జీర్ణక్రియలో ఉపయోగపడే కొన్ని ఎంజైముల తయారీకి, వ్యర్థ పదార్థాల విసర్జన క్రియకు నీరు దోహదపడుతుంది. శరీరంలోని మాంసకృత్తులు, కొవ్వు పదార్థాలు, పిండి పదార్థాల ఆక్సిడేషన్ వల్ల కూడా అర లీటరు నుంచి లీటరు వరకు నీరు ప్రతి పోషక పదార్థం తరపున లభ్యమవుతుంది. శరీరంలో నీరు తక్కువైతే చర్మం పొడిగా మారడం, మూత్ర సంబంధ వ్యాధులు, అజీర్తి, మలబద్ధకం తదితర సమస్యలు ఉత్పన్నమవుతాయి. మలిన పదార్థాలు విసర్జింపబడకుంటే పశువుల డీహైడ్రేషన్‌ను గురవుతాయి. పశువుకు రోజుకు 50 నుంచి 60 లీటర్ల నీరు అవసరం.

జాగ్రత్తలు అవసరం..



వర్షాకాలంలో గొర్రెలు, మేకల పెంపకం దారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే చిటిక, నీలి నాలుక, పారుడు, కాళ్ల డెక్కల, శ్వాసకోశ వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. గొర్రెలు, మేకలను వర్షం బారి నుంచి రక్షించడం కోసం పాకలు ఏర్పాటు చేయాలి. అప్పుడే వాటిని న్యూమోనియా వ్యాధి సోకకుండా కాపాడుకోవచ్చు. వ్యాధి సోకిన వాటిని సులువుగా జీర్ణమయ్యే ఆహారం ఇవ్వాలి. వ్యాధులు సోకిన గొర్రెలు, మేకలను మందలో కలపకూడదు. ఒక వేళ గొర్రె , మేక మృతి చెందితే దానిని ఊరికి దూరంగా తీసుకెళ్లి లోతుగా గొయ్యి తవ్వి పూడ్చి పెట్టాలి. మూగజీవాలకు ఏ వ్యాధి సోకినా వెంటనే దగ్గరలోని పశువైద్యశాలలకు తీసుకెళ్లి వైద్యం చేయించడంతో పాటు అక్కడి పశువైద్యాధికారి సలహాలు, సూచనలు పాటించాలి.
–ప్రభాకర్, జేడీ, పశుసంవర్థక శాఖ, చిత్తూరు